17వ వసంతంలోకి...
నేటి దినపత్రిక
# సూర్య
## ఎన్టీఆర్ - కృష్ణా
ఆదివారం 28 జులై 2024 పేజీలు 8

మచిలీపట్నం నుంచి విశాఖపట్నం, తిరుపతికి

## రైళ్ల పునరుద్ధరణకు చర్యలు

- ఎంపీ బాలశౌరి
- ఆగస్టు 11 నుంచి రెండు రైళ్లను పునరుద్ధరిస్తామని రైల్వే మంత్రి హామీ
- మచిలీపట్నం రైల్వే స్టేషన్‌కు నూతన శోభ

2లో



# నెంబర్ వన్‌స్థానంలో జిల్లాను నిలబెడదాం



- ఎన్నో ఆశలతో ఎన్నో బాధల నుండి బయట పడాలని గురుతర బాధ్యత మాపై ఉంచారు
- ప్రజలకు సంక్షేమ పాలన అందించాలి
- ప్రజాప్రతినిధులు, ఉద్యోగులు సహకరించాలి
- రాష్ట్ర గనులు, భూగర్భవనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర

**మచిలీపట్నం, మేజర్‌న్యూస్ :** ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా స్వచ్ఛమైన పాలన అందించి, ప్రజలకు ఇచ్చిన హామీలు నిలబెట్టుకుంటూ జిల్లాను నెంబర్ వన్ స్థానంలో నిలబెడదామని రాష్ట్ర గనులు, భూగర్భవనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. కృష్ణాజిల్లా ప్రజా పరిషత్ సర్వ సభ్య సమావేశం శనివారం స్థానిక జిల్లా పరిషత్ కన్వెన్షన్‌హాలులో జడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో తొలుత మంత్రి మాట్లాడుతూ జిల్లాలో నూతనంగా ఎన్నికైన శాసన సభ్యులకు అభినందనలు, జడ్పిటిసి, ఎంపీపీ ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం తరపున శుభాకాంక్షలు తెలిపారు. 2



## పారిశుధ్య నిర్వాహణ
# మెరుగుపరచాలి

### చిట్టినగర్ కొండ ప్రాంతంపై చిట్టచివర వరకు పరిశీలన
### వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర హెచ్‌ఎం

**విజయవాడ కార్పొరేషన్, మేజర్ న్యూస్ :** నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర శనివారం ఉదయం తన పర్యటనలో భాగంగా చిట్టినగర్ కొండ ప్రాంతం లోగల రాయప్పరాజు స్ట్రీట్, రామాలయం స్ట్రీట్, టానర్ పేట, గుజ్జారి ఎల్లారావు మార్కెట్ సముదాయం, డాక్టర్ కెఎల్ రావు పార్క్, డాక్టర్ కేఎల్ రావు స్విమ్మింగ్ పూల్ ప్రాంతాలు మొత్తం పర్యటించి క్షేత్రస్థాయిలో పర్యటించారు. ముందుగా 48వ డివిజన్లో గల రాయప్ప నగర్ ప్రాంతం మొత్తం పరిశీలించి, పారిశుధ్య నిర్వహణ సక్రమంగా జరగాలని, సైడ్ కాలువల్లో పూడికలు ఎప్పటికప్పుడు తీసేయడమే కాకుండా, డ్రైన్ మ్యాప్ ల ద్వారా ఏ పూడికలు తీసుకుంటున్నారో ఆ పూడికలను మార్క్ చేసుకొని, సైడ్ డ్రయిన్ల ప్రవాహం మ్యాప్ ద్వారా తెలుసుకుంటూ సైడ్ కాలవల్లోని పూడికలసమస్యలను పరిష్కరించవచ్చని, ప్రజారోగ్య మిగతా 2లో...

# ఉన్నత ఆశయాల వైపు
## బాలలను తీర్చిదిద్దాలి

- బాలల హక్కుల పరిరక్షణకు ఎన్నో చట్టాలు
- బాలల సంక్షేమమే పరమావధిగా "ప్రత్యేక జువనైల్ పోలీస్ యూనిట్లు"
- జిల్లా ప్రధాన న్యాయమూర్తి అరుణాసారిక




**మచిలీపట్నం, మేజర్‌న్యూస్ :** నేటి బాలలే రేపటి దేశ భవిష్యత్తు అని, వారిని ఉన్నత ఆశయాల వైపు వారి బాల్యం నుంచే తీర్చిదిద్దాల్సిన అవసరం ఎంతైనా ఉందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్ పర్సన్ అరుణాసారిక అన్నారు. శనివారం ఉదయం మచిలీపట్నంలోని జిల్లా పోలీస్ కార్యాలయం స్పందన కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ప్రత్యేక జువనైల్ పోలీస్ యూనిట్ల సభ్యులకు బాలల హక్కుల న్యాయ చట్టాలపై నిర్వహించిన శిక్షణా తరగతులకు జిల్లా ప్రధాన న్యాయమూర్తి అరుణాసారిక ముఖ్య అతిథిగా పాల్గొని శిక్షణా తరగతులను ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ దేశ జనాభాలో దాదాపు 25 శాతం ఉన్న బాలల హక్కుల పరిరక్షణకు మిగతా 2లో



(మొదటిపేజీ తరువాయి)

## ఉన్నత ఆశయాల వైపు బాలలను తీర్చిదిద్దాలి

ఎన్నో చట్టాలు ఉన్నాయన్నారు. ఉచిత నిర్బంధ విద్య, ఆరోగ్య పరిరక్షణ, మానవ అక్రమ రవాణా నిషేధం, వెట్టి చాకిరి నిర్మూలన, బాల బాలికలపై అకృత్యాల రక్షణ చట్టం (పోక్సో చట్టం), బాలల న్యాయం, బాల కార్మిక నిర్మూలన వంటి చట్టాలు బాలల సంక్షేమం, ప్రయోజనాలను సంరక్షించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రూపొందించాయని తెలిపారు. బాలల సంక్షేమమే పరమావధిగా "ప్రత్యేక జువనైల్ పోలీస్ యూనిట్లను" ఏర్పాటు చేసి ఆయా చట్టాలపై జిల్లా, గ్రామస్థాయిల్లో శిక్షణ కార్యక్రమాలను నిర్వహించాలని దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు న్యాయ సేవాధికార సంస్థలను ఆదేశించినట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు ప్రత్యేక జువనైల్ పోలీస్ యూనిట్ల సభ్యులకు బాలల న్యాయ చట్టాల పట్ల మరింత అవగాహన కలిగించేందుకు శిక్షణ తరగతులను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ శిక్షణాకాలంలో అనేక విషయాలను తెలుసుకుని వాటిని విధి నిర్వహణలో అమలుపరిచే విధంగా బాలల పరిరక్షణకై పాటుపడాలని కోరారు. జిల్లా ఎస్పీ ఆర్ గంగాధర్ రావు మాట్లాడుతూ తల్లిదండ్రుల బాధ్యతారాహిత్యం, కుటుంబ, సామాజిక, ఆర్థిక పరిస్థితులు, చెడు స్నేహాల ప్రభావంతో సమాజంలో బాలలు నేరప్రవృత్తి వైపు పయనించేందుకు ఎక్కువ ఆస్కారం ఉందని, బాలలు సన్మార్గంలో పయనించేందుకు తల్లిదండ్రులు, బంధువులు, టీచర్ల ప్రత్యేక శ్రద్ధ ఎంతో అవసరం అన్నారు. బాలల న్యాయ చట్టాలపై పూర్తి అవగాహన కలిగించుకుని వారిని సమాజానికి విలువైన వారిగా తయారు చేసేందుకు కృషి చేయాలని కోరారు. జిల్లాలో ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలోని పాఠశాలలు, కళాశాలలో మత్తు పదార్థాల సేవనం దుష్ప్రభావాలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో మొదటి అదనపు జిల్లా జడ్జి చిన్నంశెట్టి రాజు, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.వి రామకృష్ణయ్య, మచిలీపట్నం బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ అశోక్ కుమార్, గవర్నమెంట్ అబ్జర్వేషన్ హోమ్ సూపరింటెండెంట్ పి రామ్మోహన్ రెడ్డి, హెల్ప్ ఎన్జీవో సెక్రెటరీ ఎమ్మెస్ రామ్మోహన్, ఇతర పోలీసు అధికారులు, న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

## సైబర్ నేరాలపై విద్యార్థులు అవగాహనతో ఉండాలి



**జగ్గయ్యపేట జూలై 27 మేజర్ న్యూస్ :** మండలంలోని షేర్ మహమ్మద్ పేట హైస్కూల్లో సైబర్ క్రైమ్ పై అవగాహన సదస్సు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా చిల్లకల్లు ఎస్ఐ సతీష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలని, ఎవరైనా అపరిచిత వ్యక్తులు ఫోన్ చేసినా స్పందించకూడదని తెలిపారు సైబర్ నేరాల టోల్ ఫ్రీ నెంబర్ 1930 అందరూ తెలుసుకోవాలని ముఖ్యంగా ఆండ్రాయిడ్ ఫోన్స్ ఉపయోగించే వారు తెలియని లింక్స్ ఓపెన్ చేయకూడదు అని ఆధార్ నంబర్ దానికి సంబంధించిన ఓ టి పి నంబర్స్ ఎవరికి చెప్పకూడదు అని తెలియజేసినారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెడ్మాస్టర్, టీచర్స్, చిల్లకల్లు పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

## డీసెంట్లను లెక్కచేయడం లేదని జనసేన కౌన్సిల్ సభ్యురాలు ఫిర్యాదు



**పెడన, మేజర్ న్యూస్ :** మున్సిపల్ కౌన్సిల్ సమావేశాలలో ఏజెండాలోని అంశాలపై కొన్ని అభ్యంతరాలు తెలియజేస్తూ డీసెంట్లు ఇస్తుంటే వాటిని పరిగణంలోకి తీసుకోవటం లేదని మునిసిపల్ కమిషనర్ పై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తానని జనసేన కౌన్సిల్ సభ్యురాలు మట్ట శివ పావని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆమె ఒక ప్రకటనలో మాట్లాడుతూ కౌన్సిల్ సమావేశాలలో ఏ జెండాలోని కొన్ని అంశాలపై అభ్యంతరం వ్యక్తం చేసిన మున్సిపల్ కమిషనర్ మొండి వైఖరిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తానని అన్నారు. వన్ ఇండియా ఏటిఎం నిర్మాణం కొరకు అజెండాలో అంశాన్ని పొందుపరిచినప్పుడు దానికి తాను అభ్యంతరం తెలిపానని అయినా కమిషనర్ అనుమతుల ఇవ్వటంపై కౌన్సిల్ సభ్యురాలైన తనను ఏమాత్రం లెక్కచేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

### మచిలీపట్నం నుంచి విశాఖపట్నం, తిరుపతికి

# రైళ్ల పునరుద్ధరణకు చర్యలు

**మచిలీపట్నం, మేజర్‌న్యూస్ :** కృష్ణా జిల్లా కేంద్రమైన మచిలీపట్నం నుంచి రైల్వే సర్వీసులను పెంచేదిశగా చర్యలు తీసుకుంటున్నట్లు ఎంపీ వల్లభనేని బాలశౌరి తెలిపారు. ఈ మేరకు శనివారం రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో ఎంపీ బాలశౌరి భేటీ అయ్యారు. ఈ సందర్భంగా పలు అంశాలకు సంబంధించి మంత్రికి వినతి పత్రాలను ఎంపీ అందజేశారు. ఇందులో ప్రధానంగా మచిలీపట్నం నుంచి విశాఖపట్నానికి, తిరుపతికి రైళ్లను పునరుద్ధరించాలని కోరినట్లు ఎంపీ బాలశౌరి పేర్కొన్నారు. దీనిపై సదరు మంత్రి సానుకూలంగా స్పందించి ఆగస్టు 11వ తేదీ నుంచి తిరుపతి, విశాఖపట్నానికి రెండు రైళ్లను పునరుద్ధరిస్తామని తెలిపినట్లు ఎంపీ పేర్కొన్నారు. రైళ్ల పునరుద్ధరణ జరిగితే మచిలీపట్నం రైల్వే స్టేషన్‌కు నూతన శోభ వస్తుందని ఎంపీ బాలశౌరి అన్నారు. గుడివాడ, పెడన నియోజకవర్గంలో అనేక గ్రామాలకు అనుసంధానంగా ఉన్న వడ్లమన్నాడు రైల్వేస్టేషన్ లో రైళ్లు నిలుపుదల చేయకపోవడంతో చిరు వ్యాపారులు, విద్యార్థులు, ప్రయాణికులకు ఇబ్బందులు పడుతున్నారని ఎంపీ బాలశౌరి కేంద్ర రైల్వే మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. గతంలో వడ్లమన్నాడు స్టేషన్ వద్ద మచిలీపట్నం – బీదర్ రైలు, మచిలీపట్నం – విజయవాడ రైలు, మచిలీపట్నం గుడివాడ, విశాఖపట్నానికి వెళ్లే రైళ్లు నిలిపేవారని ప్రస్తుతం ఈ రైళ్లు ఏవీ అక్కడ ఆగడం లేదని ఎంపీ వివరించారు. ఈ అంశంపై కేంద్ర మంత్రికి ఎంపీ వినతిపత్రాన్ని అందజేశారు. దీనిపై విజయవాడ రైల్వే అధికారులను విచారించి చర్యలు తీసుకుంటామని కేంద్ర మంత్రి తెలిపినట్లు ఎంపీ అన్నారు. మచిలీపట్నం పార్లమెంట్ పరిధిలో ఉన్న రైల్వే వంతెనలను త్వరితగతిన పూర్తి చేయాలని కేంద్ర మంత్రిని ఎంపీ బాలశౌరి విన్నవించారు. మచిలీపట్నం పరిధిలో దాదాపు 15 ప్రాంతాలకు పైగా రైల్వే గేట్లను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని వెంటనే వాటిని ఏర్పాటు చేసే దిశగా చర్యలు తీసుకోవాలని ఎంపీ కోరారు. అదేవిధంగా సుమారు 10 ప్రాంతాల్లో రైల్వే ఓవర్ బ్రిడ్జిలు, అండర్ బ్రిడ్జిలు నిర్మించాలని వాటికి కూడా నిధులు కేటాయించి వెంటనే పూర్తి చేసేలా చూడాలని ఎంపీ కోరారు. గుడివాడ, మచిలీపట్నం రైల్వే స్టేషన్లకు ప్రత్యేక నిధులు కేటాయించి కావాల్సిన మౌలిక వసతులు, సుందరీకరణ పనులు చేయాలని అన్నారు.

# పారిశుద్ధ్య నిర్వాహణ మెరుగుపరచాలి

(మొదటిపేజీ తరువాయి)



అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. తన పర్యటనలో పరిశీలించిన బిల్డింగ్, చెట్టు వ్యర్థాలు గమనించి ఎప్పటికప్పుడు టౌన్ ప్లానింగ్, శానిటేషన్, సెక్రటరీలు, హార్టికల్చర్ విభాగం సమన్వయంతో వ్యర్థాలను తొలగిస్తూ పారిశుధ్య నిర్వాహణ మెరుగుపరచాలని అన్నారు. తదుపరి గుజ్జారి యెల్లా రావు మార్కెట్ సముదాయం పర్యటించి పరిశుద్ధ నిర్వాహన సక్రమంగా జరగాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. అదేనా పిమ్మట డాక్టర్ కే ఎల్ రావు పార్క్ సందర్శించి అక్కడ వాకింగ్ ట్రాక్లు, పార్క్ అభివృద్ధి పనులను సత్వరమే పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని పార్క్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఏ ఎస్ ఎన్ ప్రసాద్ కు ఆదేశాలు ఇచ్చారు. డాక్టర్ కే ఎల్ రావు స్విమ్మింగ్ పూల్ పరిశీలించిన కమిషనర్, ఒలంపిక్స్ విజయాలు సాధించే విధంగా కోచింగ్ ఇవ్వాలని, దానికి తగ్గట్టుగా సమయాన్ని కేటాయించి కోచింగ్ ఇవ్వాలని ఆదేశాలు ఇచ్చారు. ఈ పర్యటనలో విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యాన చంద్ర తో పాటు అడిషనల్ కమిషనర్ జనరల్ డాక్టర్ ఏ మహేష్, చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ పి రత్నావళి, జోనల్ కమిషనర్ 1 రమ్య కీర్తన, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ 1 ఏ ఎస్ ఎన్ ప్రసాద్, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ బాబా శ్రీనివాస్, డిప్యూటీ సిటీ ప్లానర్ చంద్రబాబు, పబ్లిక్ రిలేషన్స్ ఆఫీస్ రజియ షబిన, సానిటరీ సూపర్వైజర్ ఓబేశ్వరరావు, అసిస్టెంట్ ఇంజనీర్లు, సానిటరీ ఇన్స్పెక్టర్లు, సచివాలయం సెక్రటరీలు తదితరులు పాల్గొన్నారు.

# నెంబర్ వన్‌స్థానంలో జిల్లాను నిలబెడదాం





రహదారులు తదితర అజెండా అంశాలపై సమావేశంలో సభ్యులు అడిగిన ప్రశ్నలకు అధికారులచే సమాధానాలు ఇప్పించి, సభ్యులు లేవనెత్తిన సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని మంత్రి, జడ్పీ చైర్ పర్సన్, జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఆయా మండలాల్లో తాగునీటి సమస్యలపై సభ్యులు లేవనెత్తిన అంశాలపై పరిష్కార చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. జిల్లాలో 7

(మొదటిపేజీ తరువాయి)

ఎన్నో ఆశలతో ఎన్నో బాధల నుండి బయట పడాలని ప్రజలు 95% మాండేట్ ఇచ్చి గురుతర బాధ్యత మాపై ఉంచారని అన్నారు. ఉమ్మడి కృష్ణా జిల్లాలో 16 కు 16 స్థానాలు కూటమి ప్రభుత్వానికి ఇచ్చారని అన్నారు. వ్యవసాయ రంగంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాల్సిందని, బందరు పోర్టు పనులు వేగంగా పరిగెత్తించాలని, బిపిసిఎల్ కంపెనీ మన ప్రాంతంలో 60 నుండి 70 వేల కోట్ల పెట్టుబడులతో రిఫైనరీ ఏర్పాటుకు ముందుకు వస్తున్నారన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలు నిలబెట్టుకుంటూ సంక్షేమ పాలన అందించాలని, అందుకు ప్రజాప్రతినిధులు, ఉద్యోగులు సహకరించాలని, జిల్లాను నెంబర్ వన్ స్థానంలో ఉంచడానికి సంయుక్తంగా కృషి చేద్దామన్నారు. సభను ప్రారంభించిన జిల్లా పరిషత్ చైర్పర్సన్ మాట్లాడుతూ జిల్లాలో అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నట్లు ముఖ్యంగా గ్రామీణాభివృద్ధిలో రోడ్లు తాగునీరు సమస్యలు పరిష్కరిస్తూ 15వ ఆర్థిక సంఘం నిధులతో అనేక కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. మహిళల స్వావలంబన కోసం కుట్టు మిషన్లు వంటి వాటిని అందించి వారి జీవనోపాధికి తోడ్పాటు ఇస్తున్నట్లు తెలిపారు. నూతనంగా ఎన్నికైన పార్లమెంటు సభ్యులు శాసనసభ్యులు, సమన్వయంతో జిల్లా అభివృద్ధి పథంలో నడుపుటకు కృషి చేస్తామన్నారు. జిల్లాలో నూతనంగా ఎన్నికైన అవనిగడ్డ, పామర్రు, గన్నవరం, గుడివాడ, పెడన శాసనసభ్యులు మండలి బుద్ధ ప్రసాద్, వర్ల కుమార్ రాజా, యార్లగడ్డ వెంకట్రావు, వెనిగండ్ల రాము, కాగిత కృష్ణ ప్రసాద్ సభలో మాట్లాడుతూ వారి వారి నియోజకవర్గాల్లో సమస్యలు ప్రస్తావించి పరిష్కార చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ సభ్యులు ప్రస్తావించిన సమస్యలపై వెంటనే పరిష్కార చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అనంతరం వ్యవసాయం, విద్య, వైద్యం, గ్రామీణాభివృద్ధి, నియోజకవర్గాల్లో జలజీవన్ మిషన్ కింద ప్రతి ఇంటికి మంచినీటి కులాయి అందించే కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. ప్రస్తుత వర్షాకాలంలో గ్రామాల్లో ఫాగింగ్ చేయడం నీటి నిల్వ కుంటల్లో డ్రైన్లలో ఆయిల్ బాల్స్ చల్లాలని తద్వారా దోమల నివారణ చర్యలు తీసుకోవాలన్నారు. పాఠశాల భవనాలు లేని చోట్ల మంజూరు చేయాలని, పాఠశాలల్లో టాయిలెట్స్ వంటి మౌలిక సదుపాయాలు అభివృద్ధి చేయాలని ఆట స్థలం సమస్యలు ఉంటే పరిష్కరించాలని మంత్రి ఆదేశించారు. గత ఏడాది కంటే ఈ ఏడాది పదవ తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. వ్యవసాయ, ఇరిగేషన్ అంశాల్లో జరిగిన చర్చలో జిల్లాలో కాలువలు, మురుగు కాలువల్లో గుర్రపు డెక్క, తూడు తొలగింపు పనులు ఇంతవరకు చేపట్టకపోవడంవల్ల రైతులు ఇబ్బందులు పడుతున్నారని సభ్యులు ప్రస్తావించగా, వచ్చే ఏడాది నుంచి ముందుగానే కాలువల నిర్వహణ పనులు, మురుగు కాలువలలో సిల్ట్ తొలగింపు పనులు చేపట్టేలా చూస్తామని మంత్రి, జిల్లా కలెక్టర్ అన్నారు. ప్రైవేటు స్కూళ్లలో 25% సీట్లు పేదలకు కేటాయించేలా ప్రభుత్వ ఉత్తర్వులు అమలు కావడం లేదని సభ్యులు ప్రస్తావించగా, ఫీజు రెగ్యులేషన్ కమిటీలను యాక్టివేట్ చేయాలని, ప్రభుత్వ పథకాలు గురించి ప్రజాప్రతినిధులకు ముందుగా తెలియజేయాలని జడ్పీ చైర్ పర్సన్ అధికారులను ఆదేశించారు. జడ్పీటీసీలు వచ్చే ఆగస్టు 15 తేదీన జెడ్పి పాఠశాలల్లో జాతీయ జెండా ఎగరవేయడానికి ఆదేశాలు ఇవ్వాలని కోరగా రాష్ట్రస్థాయిలో ఈ అంశంపై చర్చిస్తామని మంత్రి అన్నారు. తొలుత భారత మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం ఆజాద్ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి మంత్రి జడ్పీ చైర్పర్సన్, కలెక్టర్, శాసనసభ్యులతో కలిసి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సమావేశంలో కృష్ణ, ఎన్టీఆర్, ఏలూరు జిల్లాల జడ్పీటీసిలు, ఎంపీపీలు, 3 జిల్లాల వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# మాజీ రాష్ట్రపతి, క్షిపణి శాస్త్రవేత్తకు ఘన నివాళ్ళు





**అవనిగడ్డ మేజర్ న్యూస్ :** భారతదేశ మాజీ రాష్ట్రపతి క్షిపణి శాస్త్రవేత్త భారత రత్న ఎ.పి.జె అబ్దుల్ కలాంకు అవనిగడ్డలో ఘన నివాళ్ళు అర్పించారు. అబ్దుల్ కలాం వర్ధంతిని పురస్కరించుకుని శనివారం గాంధీక్షేత్రంలో అబ్దుల్ కలాం విగ్రహానికి అవనిగడ్డ శాసనసభ్యులు మండలి బుద్ధప్రసాద్ తనయుడు, యువనాయకుడు మండలి వెంకట్రామ్ పూలమాలలు వేసి నివాళ్ళు అర్పించి భారత క్షిపణి రంగానికి వన్నె తెచ్చి, మిసైల్ మ్యాన్‌గా ఖ్యాతి గడించిన అబ్దుల్ కలాం సేవలు చిరస్మరణీయమని ఆయన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో జనసేన ఉమ్మడి జిల్లా ఉపాధ్యక్షులు మత్తి వెంకటేశ్వరరావు, తెలుగు దేశం పార్టీ జిల్లా అధికార ప్రతినిధి కొల్లూరి వెంకటేశ్వరరావు, బిజెపి జిల్లా కార్యదర్శి చేబ్రోలు ఏడుకొండలు, టిడిపి, జనసేన నేతలు ఘంటశాల కన్నయ్య, గుడివాక శివరావ్, యలవర్తి చిన్న, కొట్టె విజయ్, బడే సుబ్బారావు, గుడివాక హరిబాబు, పులిగడ్డ నాంచారయ్య, కోట సాయి, వాహిదుల్లా, బచ్చు మురళి, రేపల్లె అంకినీడు, దోవా భాస్కర్ పాల్గొన్నారు.

వైసిపి ఆధ్వర్యంలో మాజీ శాసనసభ్యులు సింహాద్రి రమేష్ బాబు ఆదేశాల ప్రకారం నియోజకవర్గ కార్యాలయంలో మాజీ రాష్ట్రపతి, భారతరత్న డా॥ ఎపిజె అబ్దుల్ కలాం 9వ వర్ధంతిని పురస్కరించుకుని కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళ్ళు అర్పించి దేశానికి ఆయన చేసిన సేవలను కొనియాడారు.

ఈ కార్యక్రమంలో ఎస్.సి విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నలుకుర్తి రమేష్, మండల కో ఆప్షన్ సభ్యులు షేక్ నజీర్ భాషా, నియోజకవర్గ పార్టీ అధికార ప్రతినిధి సింహాద్రి వెంకటేశ్వరరావు, మాజీ సర్పంచ్ నలుకుర్తి పృధ్వీరాజ్, వైసిపి రైతు విభాగం నాయకులు సామర్ల రామచంద్రరావు, మండల యూత్ నాయకులు చింతలపూడి బాలు, గరికిపాటి కృష్ణారావు, గోళ్ళ నాగేశ్వరరావులతో పాటు పలువురు పాల్గొన్నారు.

## కేంద్రీకృత వ్యూహంతో బజాజ్ ఫిన్సెర్వ్ ఏఎంసీ లార్జ్ క్యాప్ ఫండ్

**విజయవాడ, మేజర్ న్యూస్ :** లార్జ్ క్యాప్ ఫండ్‌ను ప్రారంభించినట్లు బజాజ్ ఫిన్సెర్వ్ అసెట్ మేనేజ్మెంట్ లిమిటెడ్ ప్రకటించింది. ఈ విభాగంలో ఒక ప్రత్యేకమైన ఫండ్, అధిక యాక్టివ్ షేర్‌తో, ఎంపిక చేసిన 25-30 స్టాక్‌లపై దృష్టి కేంద్రీకరించే కేంద్రీకృత వ్యూహం. ఈ ప్రత్యేకమైన విధానం ద్వారా, ఫండ్ దీర్ఘకాలికంగా మెరుగైన రిస్క్ సర్దుబాటు చేసిన రాబడిని అందించాలని లక్ష్యంగా పెట్టుకుంది. బజాజ్ ఫిన్సెర్వ్ అసెట్ మేనేజ్మెంట్ లిమిటెడ్ యొక్క ఇటీవలిఅధ్యయనం ప్రకారం, లార్జ్ క్యాప్‌ల ప్రస్తుత వాల్యుయేషన్ వారి దీర్ఘకాలిక సగటు 23.1కి దగ్గరగా ఉంది. లార్జ్ క్యాప్‌లు ప్రస్తుతం వాటి సరసమైన వాల్యుయేషన్‌కు సమీపంలోఉన్నాయని, వాటిని దీర్ఘకాలిక పెట్టుబడులకు ఆకర్షణీయమైనప్రతిపాదనగా మారుస్తుందని ఇది సూచిస్తుంది. మిడ్, స్మాల్ క్యాప్ కేటగిరీలలోని వారి తోటివారి కంటే లార్జ్ క్యాప్ స్టాక్‌లు తక్కువ తగ్గుముఖం పడతాయని, వాటి నష్టాలను వేగంగా తిరిగి పొందుతాయని అధ్యయనం చూపిస్తుంది.



## డ్రైనేజీ పనులు సమర్థవంతంగా నిర్వహించాలి

**ఎమ్మెల్యే మండలి**

**చల్లపల్లి, జూలై 27, మేజర్ న్యూస్:** డ్రైనేజీ పనులు సమర్థవంతంగా నిర్వహించాలని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అధికారులకు సూచించారు. శనివారం ఉదయం చల్లపల్లి మండలం లక్ష్మీపురం వద్ద గుండేరు మేజర్ డ్రైనేజీని ఎమ్మెల్యే పరిశీలించారు. కూటమి ప్రభుత్వంలో ఎమ్మెల్యే చొరవతో మంజూరు అయిన నిధులతో గుండేరు మేజర్ డ్రైనేజీలో గుర్రపుడెక్క తూటు కాడ తొలగింపు పనులు చల్లపల్లి డ్రైనేజీ సబ్డివిజన్ ఆధ్వర్యంలో చేపట్టగా, పూర్తిచేసిన పనులను ఆయన పరిశీలించారు. నియోజకవర్గంలో రైతులకు పటిష్టమైన డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటుచేయాలన్నారు. నూతన ప్రభుత్వంలో మంజూరైన నిధులతో ప్రణాళిక ప్రకారం పనులు నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మోపిదేవి జడ్పీటీసీ మెడబలిమి మల్లికార్జునరావు, టీడీపీ నేత పరిశె చలపతిరావు, డీఈఈ పులిగడ్డ వెంకటేశ్వరరావు, ఏఈఈ హరీష్ పాల్గొన్నారు.

## సైబర్ క్రైమ్స్ పై అవగాహన సదస్సు



**నందిగామ, జూలై 27, మేజర్ న్యూస్:** మండల న్యాయ సేవ అధికార సంస్థ ఆధ్వర్యంలో, నందిగామ బార్ అసోసియేషన్ జాయింట్ సెక్రెటరీ ఎక్కిరాల హనుమంతరావు అధ్యక్షతన నందిగామ చైతన్య డిగ్రీ కళాశాలలో " ర్యాగింగ్ – డ్రగ్స్ " పై జరిగిన న్యాయ విజ్ఞాన సదస్సు కు ముఖ్య అతిథులుగా సీనియర్ సివిల్ జడ్జ్ లక్ష్మీరాజ్యం పాల్గొన్నారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ మద్యపానం,ధూమపానం, గంజాయి, కొకైన్, హెరాయిన్ వంటి మత్తు పదార్థాలకు, దూరంగా ఉండాలని కళాశాల ఓపెనింగ్ సందర్భంలో సీనియర్ విద్యార్థులు,జూనియర్ విద్యార్థులను ప్రత్యక్షంగా గాని, పరోక్షంగా గాని, విద్యార్థులను మనస్థాపానికి గురి చేయడమే ర్యాగింగ్ అని, విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకొని, ఉన్నత శిఖరాలు అధిరోహించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ జాయింట్ సెక్రెటరీ ఎక్కిరాల హనుమంతరావు,నందిగామ -ఎస్సై-2 పండు దొర, ట్రాఫిక్ ఎస్ఐ విజయ్,సీనియర్ న్యాయవాదులు గుర్రాల వెంకటరత్నం, కొమ్మినేని మొళేశ్వరావు, షేక్ ఆజాద్ కళాశాల యాజమాన్యం, మండల న్యాయ సేవాధికార సంస్థ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



## సర్పంచ్ కృష్ణకుమారి, కార్యదర్శులు అబ్దుల్ కలాంకు నివాళులు

**చల్లపల్లి, మేజర్ న్యూస్ :** భారత మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం వర్ధంతిని గ్రామ పంచాయతీ కార్యాలయంలో శనివారం నిర్వహించారు. కలాం చిత్రపటానికి సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. మిస్సైల్మ్యాన్ జీవితం అందరికీ స్ఫూర్తిదాయకమని సర్పంచ్ కొనియాడారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి పి.వి. మాధవేంద్రరావు, శానిటరీ ఇన్స్పెక్టర్ కె. సుధాకర్, జూనియర్ అసిస్టెంట్ అనిత, కార్యాలయ సిబ్బంది, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

## జెమ్ ఆఫ్ ఇండియా అవార్డు ప్రదానం



**చల్లపల్లి, జూలై 27, మేజర్ న్యూస్:** వివిధ రంగాల్లో సేవా కార్యక్రమాలు నిర్వహించేవారికి అవార్డులు అందించే ఆల్ ఇండియా అచీవర్స్ కాన్ఫరెన్స్ ఆర్గనైజేషన్ చల్లపల్లికి చెందిన కొణకోటి రామకృష్ణకు అవార్డును అందచేసింది. న్యూఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో ఆర్గనైజేషన్ డైరెక్టర్ అభిషేక్బచ్చన్ ఆధ్వర్యంలో రామకృష్ణకు అవార్డును ప్రదానం చేసి అభినందించారు. రామకృష్ణ చల్లపల్లి శ్రావ్య ఫ్యాన్సీలో గత 20 సంవత్సరాలుగా పనిచేస్తూ కరోనా సమయంలో పేదలు, ప్రవేటు ఉపాధ్యాయులకు సహకారం అందించి సమాజంలో తనవంతు బాధ్యతను నిర్వర్తించారు. గతంలోనూ హైదరాబాద్లో ఆల్ ది బెస్ట్ ఆర్ట్స్ అకాడమీ సేవా పురస్కారాన్ని సైతం రామకృష్ణ అందుకున్నారు.

## అబ్దుల్ కలాంకు న్యాయవాదుల నివాళులు



**నందిగామ, జూలై 27, మేజర్ న్యూస్:** భారత మాజీ రాష్ట్రపతి కీర్తిశేషులు డాక్టర్ అబ్దుల్ కలాం వర్ధంతి సందర్భంగా నందిగామ బార్ అసోసియేషన్, సీనియర్ న్యాయవాది షేక్ ఆజాద్ ఆధ్వర్యంలో కలాం వర్ధంతి వేడుకలు బార్ అసోసియేషన్ హాలులో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నందిగామ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి షేక్ రియాజ్, బార్ అసోసియేషన్ జాయింట్ సెక్రెటరీ ఎక్కిరాల హనుమంతరావు, దాదా హుస్సేన్, కొమ్మినేని మొళేశ్వరావు తదితరులు పాల్గొని వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు.

## అగ్ని ప్రమాద బాధితులకు ఆర్థిక సాయం



**మచిలీపట్నం, మేజర్‌న్యూస్ :** తాళ్లపాలెం పంచాయతీ పరిధిలోని జొన్నల వారి మోడీలో అద్దాల అంజమ్మ పూరిపాక షార్ట్ సర్క్యూట్ కారణంగా ఇల్లు దగ్ధమైంది. అగ్నికి ఆహుతిఅయి కట్టుబట్టలతో వృద్ధాప్యంలో ఉన్న అంజమ్మ ప్రాణాలతో బయటపడింది. విషయం తెలుసుకున్న జనసేన పార్టీ కుటుంబ సభ్యులు జొన్నల సూర్య, బొట్ల నాగబాబు దివిమహేశ్, పెద్దిరాజులు, అద్దాలవెంకన్న, ఈవన నరసింహ, పీతలనాగేశ్వరరావు జనసేన పార్టీ ఇంచార్జ్ బండి రామకృష్ణ దృష్టికి తెచ్చారు. స్పందించిన రామకృష్ణ వెంటనే అంజమ్మను పరామర్శించి జన సైనికులు నాగబాబు, సూర్య, మహేష్, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి దేవా సహకారంతో అంజమ్మకు 15 వేల రూపాయలు నగదు నిత్యవసరాలు అందజేశారు. గ్రామ వి.ఆర్.ఓ తొలి ప్రభుత్వ పరంగా అందాల్సిన ఆర్థిక సహాయాన్ని అందించి పక్కాగృహనిర్మాణానికి ఏర్పాటు చేయాలని కోరారు. జరిగిన సంఘటనను మచిలీపట్నం పార్లమెంట్ సభ్యులు వల్లభనేని బాలశౌరి, మంత్రి కొల్లు రవీంద్ర దృష్టికి తీసుకెళ్తామని బండిరామకృష్ణ అన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన టిడిపిపార్టీ నాయకులుగడ్డం రాజు, కూనపురెడ్డి ప్రసాద్, రమేష్, జోజిబాబు, చాముండేశ్వరరావు, రాజు, నాగేశ్వరరావు, నాగబాబు, సతీష్, వాకలయ్య, దాసు, తదితరులు పాల్గొన్నారు.

## వర్షాలకు అపరాల పంటల సాగు రైతులు కుదేలు





**కంచికచర్ల జూలై 27 మేజర్ న్యూస్ :** అధిక వర్షాల కారణంగా అపరాల పంటలు సాగు చేసే రైతులు కుదేలయ్యారు.తొలకరి పంటల్లోనే రైతులకు వర్షం శాపంగా మారింది. పెసర పంట ఆకులు పసుపు పచ్చ రంగులోకి మారడం,నల్లి ఎక్కువగా ఉండటం వల్ల పూత,పిందెలు రాని పరిస్థితి ఏర్పడిందని రైతులు వాపోతున్నారు, పంటపై భారీగా పెట్టుబడి పెట్టడం వల్ల, పూత పిందె వచ్చే దశలో భారీ వర్షాలు కురవటం వల్ల పంటలకు బాగా నష్టం వాటిల్లే పరిస్థితి దాపురించిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.పెసర పంట పూత పిందె దశలో అధిక వర్షాలు పడి రైతులను బాగా ఇబ్బందులకు గురి చేసిందని చెప్పారు.ఈ ఇబ్బంది నుండి ప్రభుత్వమే మమ్మల్ని కాపాడాలని పలువురు రైతులు కోరుతున్నారు.

# రాష్ట్రంలో విద్యకు అగ్ర పీఠం

## రాష్ట్ర ఎక్సైజ్ గనుల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర




మచిలీపట్నం, మేజర్‌న్యూస్ : రాబోయే రోజులలో రాష్ట్రవ్యాప్తంగా విద్యకు అగ్ర పీఠం వేస్తున్నామని నిరుద్యోగులకు స్కిల్ డెవలప్మెంట్ కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నట్లుగా రాష్ట్ర ఎక్సైజ్ గనుల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. శనివారం మచిలీపట్నం లేడీ యాంతుల్ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ఫ్రెషర్స్ డేకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి వద్ద గల ఆశీర్వాద్ భవనంలో కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రవీంద్ర మాట్లాడుతూ రాబోయే రోజుల్లో మచిలీపట్నం యొక్క చరిత్రను మార్చుతున్నామని అన్నారు. రాబోయే రెండు సంవత్సరాల్లో బందర్ పోర్ట్ నిర్మాణం పూర్తవుతుందని అనేక అనుబంధ సంస్థలు వస్తున్నాయని నిరుద్యోగులకు ఉద్యోగాలు అందుబాటులోకి వస్తున్నట్లుగా ఆయన తెలియజేశారు. రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నేతృత్వంలో యువతకు బంగారు భవిష్యత్తు ఉంటుందని ఆయన తెలియజేశారు. కృష్ణా జిల్లా లో ప్రభుత్వపరంగా ఉన్న ఏకైక మహిళ బాలికల జూనియర్ కళాశాలకు కావలసిన అదనపు గదుల నిర్మాణాన్ని త్వరలోనే చేపడుతామని ఆయన విద్యార్థినుల హర్షద్వానాల మధ్య హామీ ఇచ్చారు. ప్రభుత్వపరంగా మొట్టమొదటి అఫీషియల్ ప్రోగ్రాం కళాశాల విద్యార్థుల మధ్య జరుపుకోవడం తనకి ఎంతగానో సంతోషకరంగా ఉందని రవీంద్ర అన్నారు. కమిటీ మాజీ సభ్యులు లంకిశెట్టి బాలాజీ మాట్లాడుతూ విద్యార్థి దశలో ఇంటర్మీడియట్ అనేది కీలకమైనదని విద్యార్థినిలు చదువు పై దృష్టి కేంద్రీకరించాలని ప్రేమ అనే వ్యవహారానికి దూరంగా ఉండాలని అన్నారు. తెలిసి తెలియని వయసులో ప్రేమలో పడటం వలన అనేకమంది ఆడపిల్లలు జీవితాన్ని కోల్పోతున్నారని బాలాజీ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ మోటమర్రి వెంకట బాబా ప్రసాద్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా చీఫ్ మేనేజర్ భగత్, మాజీ జడ్పిటిసి సభ్యులు లంకె నారాయణ ప్రసాద్, గుడివాడ మాజీ మున్సిపల్ చైర్మన్, రాష్ట్ర హ్యూమన్ రైట్స్ కమిషన్ జనరల్ సెక్రెటరీ గోవాడ శాంతి, లెక్చరర్లు ఎల్ కె హరినాథ్ బాబు, మమనవర్, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

# ప్రధాన సమస్యలను పరిష్కరించండి



**అవనిగడ్డ మేజర్ న్యూస్ :** రాష్ట్రంలో పేరుగాంచినటువంటి గురుకుల పాఠశాలలో సమస్యలను ప్రభుత్వం పరిష్కరించేందుకు కృషి చేయాలని జనసేన ఉమ్మడి కృష్ణాజిల్లా అధికార ప్రతినిధి రాయపూడి వేణుగోపాలరావు అన్నారు. శుక్రవారం రాత్రి మండల పరిధిలోని పులిగడ్డ గ్రామంలో గల గురుకుల పాఠశాలలో విద్యార్థులతో కలిసి భోజనం చేసి సంతృప్తి వ్యక్తపరచి, పాఠశాలలోని ప్రధాన సమస్యలను విద్యార్థులకు అందుతున్న మెను ని విద్యార్థులను అడిగి రాయపూడి తెలుసుకున్నారు. గురుకుల పాఠశాలలో ఉపాధ్యాయులు ప్రస్తుతం సైన్స్ సబ్జెట్ బోదించే ఉపాధ్యాయులు మాత్రమే లేరని, మిగిలిన ఉపాధ్యాయులు అందరూ ఉన్నారని, పిల్లలను కనిపెట్టుకునేందుకు ఒక డిప్యూటి వార్డెన్ అవసరమై ఉండగా టీచింగ్ ఉపాధ్యాయులే ఈ బాధ్యతను కూడా నిర్వహిస్తున్నారని, విద్యార్థులకు ఒక కేర్ టేకర్ అవసరమై ఉందన్నారు. పాఠశాలలో ప్రధాన సమస్య అయిన విద్యార్థులు విశ్రాంతి తీసుకునేందుకు భవనం పూర్తిగా శిధిలావ్యవస్థలో ఉందని, రెండంతస్తుల భవనంలో కింద మాత్రమే పిల్లలు పడుకుంటున్నారని, పై అంతస్తు శిధిలావ్యవస్థకు చేరడంతో తరగతి గదులలోని పిల్లలు పడుకుంటున్నారని తక్షణమే విద్యార్థులను దృష్టిలో పెట్టుకుని నూతన భవనం ఏర్పాటు చేయాల న్నారు. 2018లో అప్పటి ప్రభుత్వం నూతన భవనం ప్రారంభించినప్పటికి గత ప్రభుత్వ నిర్లష్యం వల్ల ఆ కాంట్రాక్ట్‌కు బిల్లులు చెల్లింకపోవడంతో భవనం సగంలో నిలిచిపోయిందన్నారు. ప్రస్తుతం ఆ భవనాన్ని పూర్తి చేసి విద్యార్థులకు వినియోగంలోనికి తేవాలన్నారు. దీనితో పాటు మరికొన్ని మరుగుదొడ్లు మరమత్తులకు చేరుకున్నాయని, గురుకుల పాఠశాలలో ఒక డయాస్ ఉన్నప్పటికి దానిపైన నేటి వరకు రేకులు వేయించలేదని, ఒక డైనింగ్ హాల్ విషయంలో గత ప్రభుత్వం నాడు నేడు కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు భోజనం చేసే బల్లలు తొలగించి నూతనంగా ఏర్పాటు చేస్తామని చెప్పడంతో నేడు విద్యార్థులు భోజనం చేసేందుకు బెంచీలు కూడా లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కోంటున్నారన్నారు. పాఠశాలలో మొత్తం 466 మంది విద్యార్థులు ఉండగా, ఒకే చోట భోజనం చేయడం కష్టంగా ఉందని, ఇక్కడ ఉన్న సమస్యలను నియోజకవర్గ శాసనసభ్యులు మండలి బుద్ధప్రసాద్ దృష్టికి తీసుకువెళ్ళడం జరిగిందని, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని మండలి చెప్పినట్లు రాయపూడి తెలిపారు. నూతన ప్రభుత్వంలో ఎన్‌డిఎ కూటమి విద్యార్థుల కనీస మౌళిక సదుపాయాలు పరిష్కారం విషయంలో తప్పక శ్రద్ధ తీసుకుని గత ప్రభుత్వం నిర్లష్యంతో ఆగిపోయి ఉన్న ప్రతి సమస్యను ఎన్‌డిఎ కూటమి నెరవేరుస్తుందని పాఠశాలలోని అధికారులు కూడా స్పందించి ఎప్పటికప్పుడు సమస్యలను నియోజకవర్గ ఎం.ఎల్.ఎ బుద్ధప్రసాద్‌కు తెలియపరుస్తూ ఉండాలన్నారు. పాఠశాలలోని సిబ్బంది, ఉపాధ్యాయులు విద్యార్థుల పట్ల స్నేహపూర్వకంగా ఉండటం చాలా సంతోషకరమైన విషయం అని రాయపూడి అన్నారు.





## హుసేన్ మాస్టర్‌కి ఘననివాళి

**మచిలీపట్నం, మేజర్‌న్యూస్ :** శనివారం మచిలీపట్నంలోని సన్ స్టార్ స్కూల్‌లో హుసేన్ మాస్టర్ సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సభలో అప్స రాష్ట్ర కౌన్సిల్ ఛైర్మన్ కె.చంద్రశేఖర్, రాష్ట్ర నాయకులు సుందర్ రామ్, కృష్ణాజిల్లా అధ్యక్షులు గౌరిప్రసాద్, మచిలీపట్నం డివిజన్ అధ్యక్షులు శ్రీజాన్, కె.మోహనరావు, కె.ప్రభాకర్, కె.దిలీప్ కుమార్, అప్స సీనియర్ సభ్యులు రాజు, కృష్ణ రావు తదితరులు పాల్గొన్నారు.

## 55 వ వారం కొనసాగిన అన్నసంతర్పణ



**అవనిగడ్డ మేజర్ న్యూస్ :** జనసైనికుల ఆద్వర్యంలో అన్నసంతర్పణ కార్యక్రమం 55వ వారం కొనసాగింది. ఆంధ్రుల అన్నపూర్ణగా పేరొందిన డొక్కా సీతమ్మను ఆదర్శంగా తీసుకుని జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ పిలుపు మేరకు గరికిపాటి రామ్, వివేక్ మిత్ర బృందం ఆద్వర్యంలో ప్రతి శనివారం మధ్యాహ్నం అవనిగడ్డ, కోడూరు రోడ్డులో గల పెట్రోల్ బంక్ వద్ద అన్నసంతర్పణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా 55 వ శనివారం విక్కుర్తి వీర రాఘవయ్య జ్ఞాపకార్ధం వారి కుమారుడు శ్రీనివాస్ ఆర్ధిక సహకారంతో అన్నదానం చేశారు. ఈ అన్నసంతర్పణ కార్యక్రమంలో 200 మందికి పైగా నిరుపేదలకు అన్నసంతర్పణ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీలు బొప్పన బాణు, మద్దెల అజయ్ కుమార్, కొప్పనాతి సాయి బాబు, గుడివాక రామాంజనేయులు,మాదివాడ కుటుంబరావు, పలువురు జనసైనికులు పాల్గొని వారి సేవలందించారు.

## త్వరితగతిన సుందరీకరణ పనులు పూర్తి చేయాలి



**అవనిగడ్డ మేజర్ న్యూస్ :** దివంగత దివిసీమ గాంధీ, మాజీ మంత్రి మండలి వెంకట కృష్ణారావు విగ్రహ సుందరీకరణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని శాసనసభ్యులు మండలి బుద్ధప్రసాద్ తనయుడు, యువనాయకుడు మండలి రాజా అన్నారు. ఆగష్టు 4 వ తేదిన మండలి వెంకట కృష్ణారావు జయంతి వేడుకలు జరగనున్న నేపథ్యంలో అవనిగడ్డ ప్రధాన కూడలిలోని మండలి వెంకట కృష్ణారావు విగ్రహ సుందరీకరణ పనులను శనివారం రాజా పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో విజయకృష్ణ గ్యాస్ ఎంటర్ ప్రైజెన్ అధినేత మత్తి శ్రీనివాసరావు, బచ్చు రఘునాథ్, గుడివాక నరహరి లతో పాటు పలువురు పాల్గొన్నారు.

## కృష్ణాజిల్లాను అగ్రస్థానంలో నిలపాలి



**అవనిగడ్డ మేజర్ న్యూస్ :** కృష్ణాజిల్లాను రాష్ట్రంలోనే అగ్రస్థానంలో నిలపాల్సిన ఆవశ్యకత ఉందని అవనిగడ్డ శాసనసభ్యులు మండలి బుద్ధప్రసాద్ అన్నారు. శనివారం మచిలీపట్నంలో ఉమ్మడి కృష్ణాజిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సమావేశంలో మండలి బుద్ధప్రసాద్ మాట్లాడుతూ గతంలో కృష్ణాజిల్లా రాష్ట్రంలో అగ్రగామిగా ఉండేదని, సమిష్టి కృషితో జిల్లాను అభివృద్ధి పథంలో నడుపుదాం అన్నారు. రాష్ట్ర విభజన అనంతరం కృష్ణాజిల్లాను అన్ని రంగాల్లో మరింత బలోపేతం చేసుకోవాల్సిన ఆవశ్యకత ఉందని, ప్రధానంగా సాగునీటి రంగాన్ని పటిష్ఠపరుచుకుందాం అన్నారు.

# నగర కమిషనర్‌ను గౌరవప్రదంగా కలిసిన జేసీ, డిప్యూటీ మేయర్, ఫ్లోర్ లీడర్లు, కార్పొరేటర్లు



నగర పాలక సంస్థ కమిషనర్ ధ్యాన చంద్రను ఎన్టీఆర్ జిల్లా జాయింట్ కలెక్టర్ నిధి మీనా, డిప్యూటీ మేయర్ 2-అవుతు శైలజ రెడ్డి, టీడీపీ ఫ్లోర్ లీడర్ బాలస్వామి, 22వ డివిజన్ కార్పొరేటర్ తాటిపర్తి కొండారెడ్డి, ఇతర కార్పొరేటర్లు గౌరవప్రదంగా కలిశారు.

**విజయవాడ కార్పొరేషన్, మేజర్ న్యూస్ :**





## న్యూట్రి గార్డెన్ ఏర్పాటు

**చల్లపల్లి, జులై 27 మేజర్ న్యూస్ :** స్థానిక నారాయణరావునగర్ లోని ఎంపీపీ పాఠశాలలో న్యూట్రి గార్డెన్ను ఏర్పాటుచేశారు. జాతీయ ఉత్తమ ఉపాధ్యాయుడు, హెచ్ఎం కైతేపల్లి దాస్ ఆధ్వర్యంలో పాఠశాల ఆవరణలో స్థలాన్ని మొక్కల పెంపకానికి అనువుగా సిద్ధంచేశారు. ఎమ్మీవో పి.వెంకటేశ్వరరావు ముఖ్య అతిధిగా పాల్గొని మొక్కలు నాటారు. ఉపాధ్యాయులు, పిల్లలు కలిసి గార్డెన్లో మొక్కలు నాటగా, వి. అచ్చమాంబదేవి విద్యార్థులకు మొక్కలు నాటడం, ఉపయోగాలను తెలియచేశారు. ఈ కార్యక్రమంలో ఎం.రత్నకుమారి, కె.పవన్ కళ్యాణ్, పేరెంట్ కమిటీ చైర్మన్ రాధ, ఉపాధ్యాయులు చంద్ర, విజయదుర్గ, రాధారాణి, రవీంద్ర, సుధీర్ తదితరులు పాల్గొన్నారు. వంగ, టమోటా, పచ్చిమిర్చి, గోంగూర, తోటకూర, పాలకూర, బచ్చలికూర తదితర కూరగాయలు, ఆకుకూరల మొక్కలు నాటటం, విత్తనాలు చల్లటం చేశారు.

## మిస్సైల్ మ్యాన్ డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం



**నందిగామ, జులై 27, మేజర్ న్యూస్ :** పట్టణం లోని కాకాని నగర్ కార్యాలయంలో శనివారం భారత మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం వర్ధంతి సందర్భంగా స్థానిక ఎన్డీఏ నేతలతో కలిసి ఆయన చిత్రపటానికి పూలమాలవేసి శాసనసభ్యులు తంగిరాల సౌమ్య నివాళులర్పించారు. ఈ సందర్భంగా సౌమ్య మాట్లాడుతూ భారత మాజీ రాష్ట్రపతి, శాస్త్ర సాంకేతిక రంగాల్లో మన దేశాన్ని ఎంతో ముందుకు నడిపించారు. సంకల్పం ఉంటే ఎంతటి ఉన్నత శిఖరాలనైనా చేరగలమన్న సందేశాన్ని యువతరానికి అందించారు. దేశ అణు, శాస్త్రీయ రంగాలకు సరికొత్త మార్గనిర్దేశనం చేసిన దార్శనికులు కలాం వర్ధంతి సందర్భంగా ఆ మహనీయుని స్మృతికి ఇదే మా ఘన నివాళులు అన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ హోదాలో ఉన్న టిడిపి నాయకులు, మైనార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## అమ్మ జ్ఞాపకాలతో మొక్క నాటుట కార్యక్రమం



**పెడన, మేజర్ న్యూస్ :** సృష్టిలో మధురమైన, మరచిపోని అమ్మను ఆదర్శంగా వృక్షో రక్షితి రక్షితః అంటూ మనలను నవమాసాలు బాధ్యతగా భరించిన అమ్మ జ్ఞాపకార్థం ప్రతి విద్యార్థి ఒక మొక్కను నాటి ప్రతిరోజూ శ్రద్ధగా చూస్తూ పెంచాలని మండల విద్యాశాఖ అధికారి-2 అన్నారు. ఈ మేరకు మండల పరిధిలో గల పల్లోటి స్కూలులో అమ్మ జ్ఞాపకాలతో మొక్క నాటుట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ వృక్షో రక్షతి రక్షితః అనే పెద్దలు ఎందుకు అన్నారంటే ఒక వృక్షం ఒక మనిషితో సమానమని ప్రతి మనిషికి ప్రాణవాయువును అందించేది వృక్షమేనని తెలిపారు. అనంతరం ఫాదర్ జోజి రెడ్డి మాట్లాడుతూ మొక్కలను పెంచుట ద్వారా పొందుకునే ప్రావీణ్యతను, ప్రాధాన్యతను తరువాత తరాల వారికి ఎలా అందించగలమో విద్యార్థినీ-విద్యార్థులకు సవివరముగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు, పాఠశాల వైస్ ప్రిన్సిపల్ ఫాథర్ యాకోబు, డీన్ రాజీవ్, విద్యార్థినీ,విద్యార్థులు, తదితరులు ఉన్నారు.

# అధికారులు మామూళ్ల మత్తులో.. కూలీల ప్రాణాలు గాల్లో...



**బాధిత కుటుంబాలకు 50 లక్షల ఎక్స్ గ్రేషియా ఇవ్వాలి**

**బండబారుతున్న కార్మికుల బ్రతుకులు**

**ఆగస్టు 2న ప్రమాదాలు, పరిశ్రమల కాలుష్యంపై ఇబ్రహీంపట్నం లో ధర్నా**

**సీపీఐ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్**

**కంచికచర్ల జూలై 27 మేజర్ న్యూస్ :** అధికారులు మామూళ్ళ మత్తులో జోగటంతో, ప్రభుత్వాల ఉదాసీనత వల్ల కార్మికుల ప్రాణాలు గాల్లో కలిసిపోతున్నాయని సిపిఐ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్ ఆందోళన వ్యక్తం చేశారు. గనులు పరిశ్రమలు కార్మిక కాలుష్య నియంత్రణ శాఖల అధికారుల అలసత్వం వల్ల ఇటీవల పరిటాలలో ఉన్న పవన్ గ్రాన్కెట్ అండ్ మెటల్ వర్క్స్ కు చెందిన క్వారీలో జరిగిన ప్రమాదంలో ముగ్గురు కార్మికులు ప్రాణాలు కోల్పోయిన విషయం విధితమే. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా బృందం శనివారం ఆ క్వారీని సందర్శించింది. ఎలాంటి భద్రత లేని క్వారీల లో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను నిశితంగా పరిశీలించారు. అనంతరం దోనేపూడి శంకర్ మీడియాతో మాట్లాడుతూ ఎన్టీఆర్ జిల్లాలో ఇటీవల పరిశ్రమలలో వరుస ప్రమాదాలు జరుగుతున్నాయని అన్నారు. అల్ట్రాటెక్ సిమెంట్, రాంకో సిమెంట్, ఎన్.టి.పి.సి, పరిటాల క్వారీ ప్రాంతాలలో జరిగిన ప్రమాదాల్లో నిరుపేద కుటుంబాలకు చెందిన కార్మికులు అసువులు బాయటంపై ఆవేదన వ్యక్తం చేశారు. తండాలకు చెందిన అతి నిరుపేదలు పొట్ట కూటి కోసం పొరుగు రాష్ట్రాలనుంచి వచ్చిన వారు ప్రాణాలు పణంగా పెట్టి క్వారీలలో పనిచేస్తున్నారని చెప్పారు. ఎండనక, వాననక, బండరాళ్ళు దుమ్ము ధూళి మధ్యలో కుటుంబాలకు దూరంగా పనిచేస్తున్న కార్మికుల శ్రమను పెత్తందారులు దోచుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కనీస రక్షణ కవచాలైన గ్లౌజులు, హెల్మెట్లు, బూట్లు కూడ ఇవ్వ కుండా ప్రమాదకరమైన పనిని చేయిస్తు న్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నాసిరకమైన జెలిటన్ స్టిక్స్ ఇచ్చి కొండను పగుల గొట్టిస్తున్న సందర్భంలో కార్మికుల బ్రతుకు బండ భారీ పోతుందన్నారు. కొన్నిసార్లు కార్మికుల ప్రాణాలు బండరాళ్ళ మధ్య తెల్లారి పోతున్నాయని పేర్కొన్నారు. ఇన్సురెన్స్,ఇ.ఎస్.ఐ వంటి కార్మిక చట్టాలను కూడా అమలు చేయడం లేదని మండిపడ్డారు. 300 ఎకరాల విస్తీర్ణంలో వున్న క్వారీలపై వేలాదిమంది ఆధారపడి వున్నారని చెప్పారు. ప్రభుత్వం 99 క్వారీలకు అనుమతి ఇచ్చిందని అదనంగా మరో 50 క్వారీలు అనధికారికంగా నడుస్తున్నా ప్రభుత్వం చేష్టలుడిగి చూస్తుందని ధ్వజమెత్తారు. అధికారులు మామూళ్ళ మత్తులో జోగుతూ పరిశ్రమల పర్యవేక్షణను గాలికి వదిలి వేసారని విమర్శించారు. అక్రమ తవ్వకాలు రక్షణ చర్యలు తీసుకోకపావడంతో క్వారీలు సమాధు లుగా మారుతున్నాయని అన్నారు. కమీషనర్ ఆఫ్ ఎంప్లాయిస్ కాంపెన్ సేషన్ యాక్ట్ నిర్దేశించినట్లు ఈ క్వారీలో చనిపోయిన కార్మికుల వయసు మేరకు 35 ఏళ్ళ రాందేవ్ భాగేల్ కుటుంబానికి రూ. 16,89,150/-ఇవ్వాలని కార్మికశాఖ అసిస్టెంట్ కమీషనర్ ఆదేశించి వారాలు దాటుతున్న బాధితులకు ఇంకా పరిహారం అందలేదన్నారు. ప్రభుత్వం మానవీయ కోనంలో ఆలోచించి మృతులు వి.వి.నాయక్, బత్తుల దుర్గారాజు, రాందేవ్ బాగేల్ కుటుంబాలకు రూ. 50లక్షల చొప్పున ఇవ్వాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, మంత్రి నారాలోకేష్, ప్రతిపక్ష పార్టీ నాయకుడు వై.ఎస్.జగన్మోహన్ రెడ్డి ఇంతవరకు పరామర్శించలేదని అన్నారు. ఇప్పటికైనా ఈ నాయకులు బాధితులను పరామర్శించి భరోసా కల్పించాలని కోరారు. ప్రమాదాలు జరుగుతున్న కంపెనీలపై విచారణ చేపట్టి ప్రభుత్వ నిబంధనలు తుంగలో తొక్కి కార్మికుల ప్రాణాలు పోవడానికి కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసారు. ఈ మేరకు ఆగస్టు 2తేదీన క్వారీల్లో ప్రమాదాలు,పరిశ్రమల కాలుష్యంపై ఇబ్రహీంపట్నం సెంటర్లో ధర్నాకు పిలుపు నిచ్చారు. ఈ ధర్నాలో సిపిఐ జిల్లా శ్రేణులు,అనుబంధ సంఘాల నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ పర్యటనలో శంకర్తో పాటు సిపిఐ ఎన్టీఆర్ జిల్లా సహాయ కార్యదర్శి బుడ్డి రమేష్, కార్యదర్శి వర్గసభ్యులు చుండూరు సబ్బారావు,ఎఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు పరుచూరి రాజేంద్రబాబు, సిపిఐ జిల్లా కార్య వర్గసభ్యులు మల్నీడు యలమందరావు, బుట్టి రాయప్ప, లంకా గోవింద రాజులు, ఎన్టీఆర్ జిల్లా సమితి సభ్యులు తాడి పైడియ్య,కొట్టు రమణారావు, కౌలు రైతుసంఘం నాయకులు పెయ్యల వెంకటేశ్వరరావు,రైతుసంఘం నాయకులు సాంబశివరావు,కన్నా వెంకట్రావు,మన్నె హనుమంతరావు, ఎస్.కె.సుభానీ, యువజన నాయకులు ఎస్.లాల్ మోహన్,గాడి అజయ్, సింగంశెట్టి మోహన్ప్రసాద్, రామకృష్ణ, హరీష్ తదితరులు పాల్గొన్నారు.



# ట్రిపుల్ ఐటీలకు వైస్ ఛాన్సలర్లను, డైరెక్టర్లను నియమించాలి





**నూజివీడు, మేజర్ న్యూస్:** నూజివీడులో కొనసాగుతున్న ట్రిపుల్ ఐటి క్యాంపస్ను సక్రమ నిర్వహణ కోసం ఆర్జీయూకేటీ కి వైస్ ఛాన్సలర్, క్యాంపస్లకు డైరెక్టర్లను ఏర్పాటు చేయాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే శివా రెడ్డి డిమాండ్ చేశారు. నూజివీడు పట్టణంలోని ట్రిపుల్ ఐటీ క్యాంపస్ ను ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కోశాధికారి సాయికుమార్, రాష్ట్ర మహిళల కో కన్వీనర్ చిన్నం ప్రీతిలతో కూడిన బృందం శనివారం సందర్శించింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైస్ ఛాన్సలర్ లేని కారణంగా విద్యార్థుల సమస్యలను తెలుసుకునే నాథుడు లేకపోయాడని వాపోయారు. హాస్టల్ లో సరైన భోజన వసతి సౌకర్యాలు లేవని విద్యార్థులు గగ్గోలు పెట్టిన, డైరెక్టర్లకు ఫిర్యాదు చేసిన స్పందించలేదని తెలిపారు. హాస్టల్ వార్డెన్ గా విధులు నిర్వర్తిస్తున్న సుబ్బలక్ష్మి విద్యార్థినీలను బూతులు తిడుతున్నారని, ఆమెను తక్షణమే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. క్యాంపస్ లో మద్యం సరఫరాపై గట్టిగా నిఘా ఏర్పాటు చేయాలని కోరారు. మద్యం, ఇతర అసాంఘిక కార్యకలాపాలకు దోహదపడే సాధనాలను సరఫరాచేసే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి విద్యార్థుల ఆరోగ్యాన్ని కాపాడాలన్నారు. అనంతరం డైరెక్టర్ ప్రొఫెసర్ చంద్రశేఖర్ ను కలిసి విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఏఐఎస్ఎఫ్ బృందం చర్చించటం జరిగింది. సానుకూలంగా స్పందించిన డైరెక్టర్ ప్రొఫెసర్ చంద్రశేఖర్ విద్యార్థుల సమస్యల పరిష్కారానికి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ కృష్ణాజిల్లా నాయకులు సాదిక్, ఎన్టీఆర్ జిల్లా నాయకుడు సురేష్, నాయకులు కరీముల్లా, విద్యార్థులు పాల్గొన్నారు.

# జగన్ దుర్మార్గ పాలనకు రాష్ట్ర ప్రజలు వీడ్కోలు పలికారు

## మాజీమంత్రి నెట్టెం శ్రీరఘురామ్



జగ్గయ్యపేట జూలై 27 మేజర్ న్యూస్ : జగన్ ఐదేళ్ల దుర్మార్గ పాలన నుంచి ఆంధ్ర రాష్ట్ర ప్రజలు విముక్తి అయ్యారు. జగన్ పరిపాలనలో జరిగిన విధ్వంసాన్ని ప్రజలకు తెలియజెప్పేందుకే చంద్రబాబు నాయుడు శ్వేత పత్రాలను విడుదల చేస్తున్నారు అని ఎన్టీఆర్ జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు మాజీ మంత నెట్టెం రఘురాం పాత్రికేయుల సమావేశంలో తెలిపారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 5 సంవత్సరాల దుర్మార్గపు పాలన నుంచి ఆంధ్ర రాష్ట్ర ప్రజలు విముక్తి అయ్యి దాదాపుగా ఇప్పటికి రెండు నెలల కాలం జరుగుతావుంది, ఇందులో చంద్రబాబు ప్రమాణస్వీకారం చేసిన నాటి నుంచి ఇప్పటికే 45 రోజుల పరిపాలన కాలం ఈ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేస్తావుంది, ఈ ప్రభుత్వం రావటమే తడవుగా ప్రజలందరూ కూడా విముక్తులు అయ్యినట్లుగా భావించారు, ఏదైతే మేము చెప్పామో గత 5 సంవత్సరాల పరిపాలనలో జరిగిన విధ్వంసకర కార్యక్రమాలైతే ప్రజలకు తెలియజేసి ఎన్నికల్లో అధికారానికి వచ్చాము, అవన్నీ కూడా నేడు పూర్తి 7 శ్వేతపత్రాల ద్వారా ప్రజలందరికీ వెల్లడించడం జరిగిందన్నారు. చంద్రబాబు ఒక నాలుగు శ్వేతపత్రాలు విడిగాను, అసెంబ్లీలో 3 శ్వేతపత్రాలు ప్రకటించడం చూశాము,మొట్టమొదటిగా పోలవరం విధ్వంసం, చంద్రబాబు ప్రమాణ స్వీకారం చేసిన వారం రోజుల్లోనే పోలవరాన్ని సందర్శించటం, అక్కడ జరిగిన విధ్వంసాన్ని ప్రజలందరికీ కళ్లకు కట్టినట్లుగా ఆయన వివరించడం జరిగింది, జగన్‌మోహన్‌రెడ్డి ఏదైతే రివర్స్ టెండరింగ్ చేశారో అలాగనే తద్వారా జరిగిన నష్టం, ఆ జాప్యం కారణంగా అక్కడ వరదలు వచ్చి డ్యామేజ్ కావడం, కొత్తగా రిపేర్లు చేయాల్సిన ఆ వాస్తవాన్ని, డయాఫ్రం వాల్ దెబ్బతిన్న వాస్తవాన్ని వీటన్నింటిని, జాప్యం వల్ల ఎన్ని వేల కోట్లు నష్టపోయామో ఒక్క పోలవరంలోనే జాప్యం కారణంగా 45వేల కోట్ల నష్టం, అంతేగాకుండా 4900 కోట్లు రిపేర్లుకు కొత్తగా మనం వెచ్చించాల్సిన పరిస్థితి, సరైన విధానంలో జాప్యం కాకుండా చేస్తే విద్యుత్తుగా ఉత్పత్తి చూస్తే అక్కడ 3వేల కోట్ల నష్టం జరిగింది, జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన కాలంలో పోలవరాన్ని ముందుకు తీసుకుని వెళ్లలేక పోని అసమర్ధత వలన దాదాపు 53వేల కోట్లు రాష్ట్ర ఎకానమీకి రావాల్సినది రాకుండా పోయిందన్నారు. అమరావతి విధ్వంసం, వచ్చిన రోజునుంచి దాన్ని పూర్తిగా ఒక వక్ర బుద్ధితోటి ఇది తెలుగుదేశం పార్టీకి, చంద్రబాబుకి పేరు వస్తదనే ఉద్దేశ్యంతోటి అమరావతిని పక్కనపెట్టి మూడు రాజధానులని చెప్పి అవి కూడా ఏమాత్రం ముందుకు పోని పరిస్థితుల్లో జరిగినటువంటి విధ్వంసం, నష్టం చూస్తే మనకు కళ్లు తిరిగిపోతాయి, దాదాపు అది పూర్తి చేయకపోవడం వలన అక్కడ ఎకానమీలోకి రాకుండా 3లక్షల కోట్ల రూపాయల భారీ నష్టం జరిగింది, ఇది సత్వరమే 5 ఏళ్లలో పూర్తిచేసినట్లయితే అక్కడ 7లక్షల ఉద్యోగాలు వస్తాయని మేము చెప్పాము, కంపెనీల రాలేదు, కేంద్ర ప్రభుత్వ సంస్థలు రాలేదు, ఉద్యోగాలు రాకుండా పోయాయి ఈ రకంగా ఎన్ని లక్షల కోట్ల నష్టం జరిగిందో మనకు కనపడుతున్న వాస్తవం.విద్యుత్తుపై శ్వేతపత్రాన్ని చంద్రబాబు ప్రకటించారు, దాదాపు అందులో నేడు చూస్తే విద్యుత్తు అన్ని విభాగాల్లో చూస్తే కలిపి లక్ష 29వేల కోట్ల రూపాయలు ఇప్పుడు అప్పు ఉంది, 5 ఏళ్ల కాలంలో 32వేల కోట్ల విద్యుత్తు చార్జీలు పెంచారు, నాడు చంద్రబాబు భవిష్యత్తును ఆలోచించి ఏమేరకు రాబోయే 25 ఏళ్లకు మనకు కరెంటు ఎంత అవసరమవుతుందోనని, ఉత్పత్తి పెంచాలని పీపీఏలను రూపొందిస్తే ఆ రోజున జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం కక్షపూరితంగా రద్దు చేసిన కారణంగా మనం నేడు విద్యుత్తును అధిక ధరలకు కొనాల్సిన దుస్థితి. పీపీఏలను రద్దు చేసి కోర్టులో ఓడిపోతే, ఆనాటి విద్యుత్ విధానాలను జగన్ కొనసాగించక రద్దు చేయడం వలన దాదాపు 9వేల కోట్ల ప్రభుత్వ ధనాన్ని పీపీఏలకు చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు, కాంట్రాక్టర్లకు నగదు రూపంలో ఎక్కడా రశీదుల్లో సరిగా లేకుండా డంప్‌లో అక్రమంగా ఇసుకను తరలించడం చూశాము, ఈ డబ్బులన్నీ కూడా వాళ్ల సొంత మనుషులకి, తాబేదారులకు వెళ్లిపోయాయి స్పష్టమైన విషయం, మైన్స్ రూపేనా 10వేల కోట్లను దోచుకున్నారు, అంతకుమున్న లైసెన్సుదారుల్ని ఎమ్మెల్యేలు, వైఎస్సార్‌సీపీ నాయకులు బెదిరించి వాళ్ల మీద ఈడీ, విజిలెన్స్, ఇతర నిఘా వారిని ఉసిగొల్పి అవన్నీ కబ్జా చేసి దాదాపు 10వేల కోట్లను వాళ్ల సొంతానికి దోచుకున్నారు. ఇంకా తవ్వుతుంది ప్రభుత్వంది, ఎన్ని బయటపడతాయో తెలియని పరిస్థితి. 5 ఏళ్ల జగన్ ప్రభుత్వంలో భూముల మీద పూర్తిగా బకాసురుల్లా పడి దోచుకున్నారు విశాఖపట్నంలో విజయసాయిరెడ్డి లీలలు అక్కడ కనపడుతున్న పరిస్థితి, వేల ఎకరాలు విజయసాయిరెడ్డి ప్రోద్బలంతో కబ్జా చేసింది విచారణలోకి రాబోతోంది, మదనపల్లె సబ్‌కలెక్టర్ ఆఫీసుని దగ్ధం చేసి రెవెన్యూ దస్త్రాలు దహనం చేసిన పరిస్థితి, దాదాపు 2లక్షల ఎకరాలకు పైగా మదనపల్లె రెవెన్యూ డివిజన్‌లో 22ఏ నుంచి భూముల్ని తొలగించిన స్థితిని అక్కడ సీఐడీ విచారణలో బయటపడింది, ఒక్క రెవెన్యూ డివిజన్‌లో అంత చేశారంటే, ఎంత స్వలాభం లేకుండా చేశారనేది మనకు కనపడుతున్న వాస్తవం, ఈ రకంగా రాష్ట్రం మొత్తం ఎక్కడెక్కడా జరిగాయో శోధించాల్సిన అవసరమున్నది, లక్షల ఎకరాలు అన్యాయంగా అక్రమంగా రెవెన్యూ రికార్డుల్ని తారుమారు చేసి, పొజిషన్‌లో వున్న పేద బలహీనవర్గాలను మభ్యపెట్టి, భయపెట్టి ఆ రకంగా రిజిస్ట్రేషన్లు చేసుకుని దానికొక చట్టాన్ని 20 ఏళ్లు అయితే అవి అమ్ముకోవచ్చుని దాన్ని ఆసరగా తీసుకుని ఈ భూములను కైంకర్యం చేశారో శ్వేతపత్రం ద్వారా బయటపడింది.మద్యంలో 99వేల కోట్ల రూపాయల ట్రాన్సాక్షన్ నగదు రూపంలో జరిగింది, ఇది ఎక్కడికెళ్లకి వెళ్లిందో బయటపడాల్సివుంది, ఏ రకమైన దోపిడీ జరిగిందోనని సీఐడీకి అప్పగించారు, వాసుదేవరెడ్డి ఇప్పటికే పరారీలో ఉన్నాడు, ఇందులో పెద్ద పెద్దవాళ్లకి చివరికి జగన్‌కి కూడా వాటాలున్నాయనేది కనపడుతున్న వాస్తవం, ఇది కూడా శ్వేతపత్రం ద్వారా చంద్రబాబు బయటపెట్టారు. శాంతి భద్రతలు చూస్తే 5 ఏళ్ల జగన్ పాలనలో ఎంతటి దుర్మార్గమైన అరాచకమైన స్థితి, ఈ రాష్ట్రంలో ప్రజాస్వామ్యం అనేది లేకుండా ప్రతిపక్షాలను హింసించడమే ధ్యేయంగా తెలుగుదేశం పార్టీని, ఎదురుతిరిగి ప్రశ్నించిన వాళ్లని నిర్మూలించడమే అవధిగా పరిపాలించారు, ఏమాత్రం కేసు పెట్టే వీలు లేని వాటిని కూడా అచ్చెన్నాయుడు, నరేంద్ర, రవీంద్ర పై, వందలాది మంది పార్టీ నాయకులపై కేసులు పెట్టి ఇబ్బందులకు గురిచేశారు, నిన్న శాసనసభలో మీరందరిలో ఎంతమందిపై కేసులున్నాయో లేచి నిలబడాలని శాసనసభలో చంద్రబాబు చెబితే దాదాపు 80 శాతం మంది శాసనసభ్యుల్ని నిలబడటం జరిగింది, దీన్నిబట్టి స్వతంత్ర భారత చరిత్రలో గత 5 ఏళ్ల జగన్ పరిపాలనలో ప్రతిపక్షాల్ని నిర్మూలించాలనే ఉద్దేశ్యం మనకు కనపడుతుంది, బయట కొన్ని లక్షల మంది తెలుగుదేశం, జనసేన కార్యకర్తల్ని ఏ రకంగా హింసించారో ఉన్నాయన్నారు. పిన్నెల్లిని పరామర్శించిన జగన్ ఇతను మంచోడు అని చెప్పడమంటే ఇక్కడే జగన్ స్వభావం అందరికీ కనపడుతుంది, సబ్‌కలెక్టర్ ఆఫీసు తగలబెడితే అది ప్రమాదమని చెబుతూ పెద్దిరెడ్డి, మిథున్‌రెడ్డి చాలా మంచోళ్లు అంటున్నాడు. ఓడిపోయిన పరిస్థితుల్లో కూడా ఏమాత్రం సిగ్గు లజ్జా లేకుండా అతను ఆ వెళ్లబెట్టుకుంటున్న పరిస్థితి చూస్తున్నాం, ఆర్థిక పరిస్థితిపై శ్వేతపత్రం చూస్తే 9లక్షల 74వేల కోట్ల రూపాలయ అప్పు నేడు ఉందని మనకు కనపడుతుంది, ఇంకా తవ్వుతన్నారు పెండింగ్ బిల్లులు ఇప్పటికే 1లక్షల 30వేల కోట్ల, ఇంకో లక్ష కోట్లు ఉంటాయని తెలుస్తున్న సమాచారం, ఆ రకమైన ఆర్థిక స్థితిని చూస్తే దాదాపు 6లక్షల కోట్లు కేవలం జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన కాలంలో అప్పులు, చెల్లింపులు ఇప్పటికీ ఉన్నాయి, దీనికిగాను 8వేల కోట్ల ఆదాయం వస్తే సుమారు 8వేల కోట్లు అప్పులు చెల్లించాల్సిన పరిస్థితి. జగన్ ఆర్థిక విధానాన్ని సక్రమంగా నిర్వహించలేపోవడం వలన అప్పులు పెరిగి, మరో ప్రక్కన ఆస్తులు పెరగక మనకు రావాల్సిన సంపద రాకుండా పోయింది, దాదాపు 12లక్షల 93వేల 260 కోట్ల ఆర్థిక విధ్వంసం జరిగిందన్నారు. శ్వేతపత్రాలు విడుదల చేస్తున్నాం శాసనసభకు జగన్ నువ్వొచ్చి సమాధానం చెప్పాలని చంద్రబాబు చెబుతున్నారు, ప్రభుత్వం చెబుతుంది కానీ శాసనసభకు రాకుండ ఎగ్గొట్టాడు, మొదటిరోజు వచ్చి అల్లరిచేసి ఢిల్లీకి వెళ్లి ధర్నా చేసి అభాసుపాలై వెనక్కి వచ్చి నిన్న ప్రెస్‌మీట్‌లో నేనింకా శాసనసభకు వెళ్లను, శాసనసభలో చెప్పేవన్నీ అబద్ధాలంటున్నాడు, శాసనసభను ఎదుర్కోలేని పరిస్థితుల్లో భయపడి, బయట ఉన్నవి లేని చెబుతూ, నేను మీడియా ముందే చెబుతానంటే జగన్ ఏ రకంగా ప్రజలకి బాధ్యత వహిస్తున్నాడో అర్థమవుతుంది, హోదా ఉంటేనే ప్రతిపక్ష నాయకుడివా అంటే నువ్వు ప్రతిపక్ష నాయకుడివి కాదా ప్రజలకు జవాబుదారీగా నిలబడవా, నీ ఐదేళ్ల పరిపాలనకాలంలో అంతే చేశారు నీ సొంత లాభం కోసమే మొత్తం ఎకానమీని దుర్మార్గంగా చేసి నష్టపర్చావు, మళ్లీ అతే పంథాలో నిజమైన ప్రతిపక్ష పాత్ర పోషించకుండా పారిపోతున్న పిరికివాడివి. ఇప్పటి దాకా అధికార బలంతో కోర్టులకు వెళ్లకుండా మేనేజ్ చేసి, నేడు భయంతో నన్ను అరెస్టు చేస్తారని జైలుకుపోతానని భయపడి పిరికివాడి శివాలెత్తినట్లుగా ఢిల్లీపోయి అభాసుపాలై, జగన్ నీ తీరు పట్ల ప్రజలు అసహ్యించుకుంటున్నారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో నూజివీడు నియోజకవర్గ రాష్ట్ర పరిశీలకుడు గింజుపల్లి రమేష్ ఎన్టీఆర్ జిల్లా తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధులు తాళ్లూరు వెంకటేశ్వర్లు షేక్ అన్వర్ కౌన్సిలర్ నియోజకవర్గ తెలుగు మహిళా అధ్యక్షులు కన్నెబోయిన రామలక్ష్మి మాజీ జెడ్పిటిసి అన్నెబోయిన రాణి జగ్గయ్యపేట తెలుగుదేశం పార్టీ మండల ప్రధాన కార్యదర్శి డేవిడ్ తదితరులు పాల్గొన్నారు.

# దేశానికే మార్గ నిర్దేశకుడు అబ్దుల్ కలాం



**జగ్గయ్యపేట జూలై 27 మేజర్ న్యూస్ :** భారతదేశ రక్షణ రంగాన్ని అగ్రపథంలో నిలిపిన మహోన్నత వ్యక్తి, రాష్ట్రపతి పదవికే వన్నె తెచ్చిన మహనీయుడు, భారతరత్న డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం అని శాసనసభ్యులు శ్రీరాం రాజ గోపాల్ అన్నారు శాస్త్రవేత్తగా, ప్రజా రాష్ట్ర పతిగా, విద్యార్థులకు మార్గనిర్దేశ కునిగా, రచయితగా అసమాన ప్రతిభా పాటవాలు చూపిన మహోన్నత వ్యక్తి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం ని టిడిపి జాతీయ కోశాధికారి శాసనసభ్యులు శ్రీరాం రాజగోపాల్ అన్నారు. కలాం వర్ధంతిని పురస్కరించుకొని పట్టణంలో ఎన్టీఆర్ సర్కిల్ వద్ద గల డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం విగ్రహానికి స్తానిక నేతలతో కలసి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

ఈ సందర్భంగా శాసనసభ్యులు శ్రీరాం తాతయ్య మాట్లాడుతూ మిస్సైల్ మ్యాన్'గా భారత సాంకేతిక సామర్థ్యాన్ని ప్రపంచానికి చాటి చెప్పిన అసామాన్య ప్రజ్ఞాశాలి అన్నారు. రామేశ్వరం నుంచి రాష్ట్రపతి భవన్ వరకు.. పేపర్ బాయ్ నుంచి ప్రెసిడెంట్ వరకు సాగిన ఆయన జీవన ప్రస్థానం యువతరానికి స్ఫూర్తిదాయకమన్నారు. ఎంత ఎదిగినా ఒదిగి ఉండాలనే ఆయన స్వభావం ఎందరికో మార్గనిర్దేశం. 'కలలు కనండి. వాటిని సాకారం చేసుకోండి' అని కలాం చెప్పిన మంచి మాట యువతలో ఆత్మవిశ్వాసం నింపుతుంద న్నారు. ఒక శాస్త్రవేత్తగా జీవితాన్ని ప్రారంభించిన కలాం.. తర్వాత అంతరిక్ష పరిశోధనల్లో భారత్‌కు ఎన్నో విజయాలు అందించారన్నారు. అలాంటి మహోన్నత వ్యక్తి సేవల్ని భారత జాతి ఎన్నటికీ మరిచిపోలేదన్నారు. నేడు అబ్దుల్ కలాం వర్ధంతి సందర్భంగా ఆయన చెప్పిన మంచి మాటలను స్మరించుకుందామన్నారు.

# ప్రతి ఒక్కరూ ఒక మొక్క నాటండి



**గన్నవరం, జూలై 27, మేజర్ న్యూస్ :** గన్నవరం పాఠశాల ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయురాలు ఉమాదేవి ఆధ్వర్యంలో శనివారం మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా విద్యాశాఖ వారు ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న శిక్షా సప్తహ్ కార్యక్రమంలో భాగంగా ఐదవ రోజు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (హైస్కూల్ ప్లస్) గన్నవరం పాఠశాల ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయురాలు ఉమా దేవి ఆధ్వర్యంలో, పాఠశాల స్టాఫ్ సెక్రటరీ జి. రవిబాబు పర్యవేక్షణలో, పాఠశాల ఉపాధ్యాయిని ఉపాధ్యాయుల సంయుక్త సహకారంతో ఆహ్లాదకరమైన వాతావరణంలో శనివారం మొక్కలు నాటే కార్యక్రమం పాఠశాల ఫిజికల్ డైరెక్టర్లు ధనియాల నాగరాజు, షేక్ మీరా సాహెబ్ ఘనంగా నిర్వహించడం జరిగింది. విద్యార్థినీ, విద్యార్థులు మొక్కలు నాటే కార్యక్రమంలో అత్యంత ఉత్సాహంగా పాల్గొనటం జరిగినది. ప్రతి ఒక్కరూ ఒక మొక్క నాటండి, ఆ మొక్కను తల్లి లా కాపాడండి అని ఉమాదేవి తెలిపారు. ఈ కార్యక్రమం లో సౌట్స్ అండ్ గైడ్స్ కో ఆర్డినేటర్ స్వాతి, రాము, పద్మ పాల్గొనగా గణిత ఉపాధ్యాయులు కొండల రావు, జ్యోతి దంపతులు తన కుమార్తె స్ఫూర్తి తో మొక్క నాటించారు.

# వైభవంగా ప్రారంభమైన మోపిదేవి స్వామి వారి ఉత్సవములు





**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** ప్రసిద్ధ పుణ్యక్షేత్రంగా పేరుపొందిన మోపిదేవి క్షేత్రంలో కొలువై ఉన్న శ్రీ వల్లి దేవసేనా సమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి జన్మ నక్షత్రం ఆడి కృత్తికను పురస్కరించుకొని పవిత్రోత్సవములు శనివారం అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. స్వస్తిశ్రీ చాంద్రమాన శ్రీ క్రోధి నామ సంవత్సర ఆషాడ బహుళ సప్తమి అనగా స్థిర వారం ఉదయం 8 గంటల నుండి 12 గంటల వరకు గోపూజ, సుప్రభాత సేవ, అభిషేక జల సంగ్రాహణము, ఆలయ ప్రదక్షిణ, విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవాచనము, ఋత్విగ్వరణ, అఖండ స్థాపన, వాస్తు మండపారాధన, సుబ్రహ్మణ్య మూల మంత్ర అనుష్టానములు, మహా నివేదన, నీరాజన మంత్రపుష్పములు నిర్వహించగా, సాయంత్రం వాస్తు హోమం పర్యగ్ని కరణము అంకురారోహణ ప్రధాన దేవతా సహిత సర్వతో భద్ర మండపారాధన పట్టు పవిత్రములు ఆసాధన ఆదివాసములు చతుర్వేద స్వస్తి అనంతరం తీర్థప్రసాదముల వినియోగం చేశారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక అలంకరణలు పూజలు నిర్వహించారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలంకరణలతో ముస్తాబు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఉప కమిషనర్, కార్యనిర్వాణాధికారి యన్.యస్. చక్రధరరావు సూపరింటెండెంట్ బొప్పన సత్యనారాయణ, వేద పండితులు, అర్చక స్వాములు, ఆలయ సిబ్బంది, అధికసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# నియోజకవర్గంలో ఒకే ఒక్కడు కోగంటి

## ప్రణీత కాలనీ మహిళల ప్రశంసలు





**కంచికచర్ల జులై 27 మేజర్ న్యూస్ :** రెండు దశాబ్దాలుగా తెలుగు దేశం పార్టీని ముందుండి నడిపిస్తున్న కోగంటి బాబు ప్రతి ఒక్కరికి ఆదర్శమని కంచికచర్ల ప్రణీత కాలనీ తెలుగుదేశం పార్టీ మహిళా నాయకురాలు ప్రశంసించారు.స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో వారు కోగంటి బాబు చే కేక్ కట్ చేపించి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ప్రణీత కాలనీ దేశం పార్టీ నాయకురాలు మాట్లాడుతూ నందిగామ నియోజకవర్గం లో తెలుగుదేశం పార్టీ గెలుపు కోసం అహర్నిశలు కృషి చేసిన వ్యక్తి కోగంటి అని కొనియాడారు,భారీ మెజారిటీతో తంగిరాల సౌమ్య ని గెలిపించిన కోగంటి బాబు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపి ఘనంగా సన్మానం చేశారు. నీ వెంటే మేముంటామని నీతో కలిసి తెలుగుదేశం పార్టీ ప్రతిష్టతకు కృషి చేస్తామని అన్నారు.ఈ కార్యక్రమంలో ప్రణీత కాలనీ తెలుగుదేశం పార్టీ మహిళామణులు పాల్గొన్నారు.

# జిల్లా సమగ్ర అభివృద్ధికి కలిసికట్టుగా కృషి చేద్దాం



**మచిలీపట్నం, మేజర్‌న్యూస్ :** జిల్లా సమగ్ర అభివృద్ధికి ప్రజాప్రతినిధులు అధికారులు కలిసికట్టుగా కృషి చేద్దామని రాష్ట్ర గనులు భూగర్భవనరులు ఆబ్కారి శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. శనివారం సాయంత్రం నగరంలోని కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్లో మంత్రి జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ సంయుక్త కలెక్టర్ గీతాంజలి శర్మలతో కలిసి శాసనసభ్యులు, అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం, పంచాయతీరాజ్, రహదారులు భవనాలు, రవాణా శాఖ అధికారులతో సమీక్షించారు. జిల్లాలో ప్రభుత్వ సంక్షేమ అభివృద్ధి పథకాలు, కార్యక్రమాలను కట్టుదిట్టంగా అమలు చేసేందుకు అధికారులు సంసిద్ధంగా ఉండాలన్నారు. ఇందుకు శాసనసభ్యులు అందరూ కూడా తమ వంతు సహకారం అందించాలన్నారు. ఉపాధి హామీ పథకం కింద ప్రజలకు మేలు జరిగే పనులను ముమ్మరంగా చేపట్టాలన్నారు. జిల్లా ఖనిజ నిధుల నుండి చేపట్టి 70 నుంచి 80% పూర్తయిన పనులను నూటికి నూరు శాతం త్వరితగతిన పూర్తి చేసి వినియోగంలోకి తీసుకుని రావాలన్నారు. ప్రమాదాల నివారణ కోసం రహదారి భద్రత నియమాలను ప్రతి ఒక్కరు విధిగా పాటించేలా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. తొలుత జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఈ సంవత్సరం 398 ప్రమాదాలు జరిగాయని అందులో 198 ప్రమాదాలూ జాతీయ రహదారి పైన జరిగాయని, 49 ప్రమాదాలు రాష్ట్ర రహదారిపైన ప్రధానంగా జరిగాయన్నారు. అందులో 177 మరణాలు సంభవించగా 102 మరణాలు జాతీయ రహదారి పైన జరిగాయన్నారు. అతివేగం వలన, సీటు బెల్టు, హెల్మెట్ ధరించకపోవడం వలన ప్రమాదాలు జరిగాయని కలెక్టర్ మంత్రికి వివరించారు. అలాగే ఆవులు, గేదెలు కూడా రహదారులపై ఉండటం వలన ప్రమాదాలు సంభవిస్తున్నాయని కలెక్టర్ మంత్రికి వివరించారు. ఈ ప్రమాదాల నివారణ కోసం వాహన చోదకులు తప్పనిసరిగా హెల్మెట్లు, సీటు బెల్టులు వేసుకునే విధంగా సానుకూల దృక్పథంతో ఒక ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. మొదట ఈ కార్యక్రమం కలెక్టరేట్ నుండి ప్రారంభించి ప్రతి ఒక్క ఉద్యోగి హెల్మెట్ ధరించేలా చర్యలు తీసుకున్నామన్నారు. అలాగే నాలుగు చక్రాల వాహనాల్లో సీట్ బెల్ట్ వేసుకోకుంటే వచ్చే బీప్ సౌండ్ ను ఆపేందుకు ఉపయోగిస్తున్న బీప్ స్టాపర్లను సీజ్ చేసే కార్యక్రమాన్ని కూడా చేపట్టామన్నారు. ఈ కార్యక్రమానికి జిల్లాలోని ప్రజా ప్రతినిధులు తమ వంతు సహకారాన్ని అందించి ప్రమాదాల నివారణకు తోడ్పడాలన్నారు. ఈ సమావేశంలో గుడివాడ, గన్నవరం,పెడన, పామర్రు శాసనసభ్యులు వెనిగండ్ల రాము, యార్లగడ్డ వెంకట్రావు కాగితపు కృష్ణ ప్రసాద్, వర్ల కుమార్ రాజా, డిఆర్వో కే చంద్రశేఖర రావు, డిటిసి పురేందర్, ఆర్డిఓ ఎం వాణి, సిపిఓ గణేషు, డ్వామా పిడి సూర్యనారాయణ, పంచాయతీరాజ్ ఎస్ ఈ విజయ్ కుమారి, ఆర్ అండ్ బి ఈఈ శ్రీనివాసరావు, డిపిఓ నాగేశ్వర నాయక్ తదితర అధికారులు పాల్గొన్నారు.



## నారాయణ ఈ.ఎం. స్కూల్‌లో ట్విన్నింగ్ డ్రస్ కంపిటీషన్

**విజయవాడ, మేజర్ న్యూస్ :** పటమట హైస్కూల్ రోడ్‌లోని నారాయణ ఈ.ఎం. స్కూల్ ఈకిడ్స్ విద్యార్థిని విద్యార్థులకు ట్విన్నింగ్ డ్రస్ కంపిటీషన్ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆర్ & డీ హెడ్ మరియా పాట్రిక్ మాట్లాడుతూ విద్యార్థిని విద్యార్థులను చిన్నవయస్సు నుంచే స్కూల్ ను అలవర్చేందుకు వారు, ఆనందించాలా ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. నారాయణ స్కూల్స్‌లో చదువుతో పాటు విద్యార్థి దశ నుంచే వారికి అవసరమైన క్రీడలు, కల్చరల్‌కు వారి తయారు చేసేందుకు స్కూల్ యాజమాన్యం, ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులతో పాటు పిల్లల తల్లిదండ్రులు ఆశక్తి చూపడం ఆనందించదగ్గ విషయమన్నారు. విద్యార్థులలోని ప్రతిభను చిన్నవయస్సులోనే గుర్తించి వారు ఆదిశగా అడుగులు వేసేలా ఉపాధ్యాయులతో పాటు తల్లిదండ్రులు కూడా ప్రోత్సహించాలన్నారు. రంగురంగు దుస్తులలో విద్యార్థిని విద్యార్థులను చూసి తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఏజీఎం మురళీ కిషోర్, కోఆర్డినేటర్ కనక దుర్గ, క్లస్టర్ ప్రిన్సిపాల్ రాజశేఖర్, ప్రిన్సిపాల్ శామ్యూల్ రాజు పాల్గొన్నారు.

## జనసేన క్రియాశీలక సభ్యత్వాల నమోదు



**కంచికచర్ల జులై 27 మేజర్ న్యూస్ :** మండలంలోని పరిటాల గ్రామంలో జనసేన క్రియాశీలక సభ్యత్వాలను నమోదు కార్యక్రమం శనివారం జరిగింది. గత వారం రోజులుగా జనసేన అధినేత డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పిలుపు మేరకు ప్రతి పేదవారికి జనసైనికుల కుటుంబాలకు అండగా భరోసాగా నాలుగో విడత క్రియాశీలక సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించడం జరిగిందని మండల అధ్యక్షులు నాయిని సతీష్ తెలిపారు. పరిటాల గ్రామంలో 120 మందికి పైగా క్రియాశీలక సభ్యుల్ని నమోదు చేయించడం జరిగిందని అన్నారు. వారికి జనసేన పార్టీ తరఫున జీవిత బీమా వర్తిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రామ్ కమిటీ సభ్యులు తోట ఓంకార్, పరిటాల గ్రామ గౌరవ అధ్యక్షులు పురమ కాలేశ్వరరావు, జనసేన పార్టీ గ్రామ అధ్యక్షులు కొమ్మ నరేష్, ఉపాధ్యక్షులు మాణిక్యాల బ్రహ్మం, జనసేన పార్టీ మండల కార్యదర్శి పురమ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



17వసంతాల 'సూర్య' మహాయజ్ఞంలో 'సూర్య' అక్షర సైనికుల భాగస్వామ్యంతో అనితర సాధ్యం కాని ఎన్నో లక్ష్యాలను అధిగమించింది. ఈ ప్రస్థానంలో సూర్యాక్షరంతో మమేకమైన 'సూర్య' కుటుంబ సభ్యులందరికీ అక్షర నమస్సులు. మాకు తోడుగా నిలుస్తున్న పాఠకులకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు పేరుపేరున కృతజ్ఞతాభివందనాలు.

ఇట్లు ఎన్.వెంకట్, ఎన్టీఆర్ - కృష్ణా బ్యూరో
ఫోన్ : 9642 980 999